అన్నదాతలకు 'భరోసా'

- లబ్ధిదారులకు వైఎస్సార్ రైతు భరోసా జమ
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు
- సాంకేతిక కారణాలతో నిలిస్తే స్పందనలో ఫిర్యాదుల స్వీకరణ



రైతు భరోసా నిధుల చెక్కును విడుదల చేస్తున్న జేసీ ధ్యానచంద్ర

అమలాపురం రూరల్: తాను చెమటోడ్చి అందరి ఆకలి తీర్చే అన్నదాతలకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలబడుతోంది. పంట పెట్టుబడులు తగ్గించడం... వడ్డీ వ్యాపారుల నుంచి సాగుదారులను రక్షించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ యోజన కింద అందించే ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. వ్యవసాయం దండగ కాదు, పండగ చేసి చూపిస్తానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చేసిన బాసల్ని అక్షరాలా అమలు చేసి చూపిస్తున్నారు.

సాగుకి పెట్టుబడుల కోసం రైతులంతా గతంలో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవారు. అయితే ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం మొదలుపెట్టాక ఆ అవసరం ఉండడం లేదు. సరిగ్గా పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఖాతాల్లో భరోసా సొమ్ము పడుతోందని అన్నదాతలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో రైతుకి రూ.2 వేలు జమ చేయగా, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మరో రూ.2 వేలు జమ చేసింది. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో కలిపి మొత్తంగా 38,121 మంది రైతులకు గాను రూ.11.38 కోట్ల సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేశారు.

స్పందనతో పరిష్కారం

వివిధ కారణాల రీత్యా రైతులెవరికైనా వైఎస్సార్ భరోసా సొమ్ము జమ కాకపోతే స్పందన ద్వారా ఫిర్యాదులు స్వీకరించి వారికి సాయం అందేలా చూస్తున్నారు. స్పందన ద్వారా రైతు భరోసాకి సంబంధించి అమలాపురం నియోజకవర్గంలో 226, ముమ్మిడివరం నియోజకవర్గంలో 413 ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదుల్ని పరిష్కరించి మొత్తంగా 639 మంది రైతులకు రూ.47,92,500 సొమ్ముని ఆయా రైతుల ఖాతాల్లో జమ చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పొలంలో పురుగుల మందు స్ప్రే చేస్తున్న రైతులు

బ్యాంకుకి వెళ్లి డ్రా చేసుకున్నా



నాకు రైతు భరోసా సొమ్ము రాకపోతే స్పందనలో ఫిర్యాదు చేశాను. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించి సొమ్ము ఖాతాలో పడేలా చూశారు. బ్యాంకుకి వెళ్లి డ్రా చేసుకున్నాను.
– జనుపెల్లి శివకుమార్, కౌలు రైతు, సమనస, అమలాపురం మండలం

ఏటా భరోసా అందుతోంది



ఏటా రైతు భరోసా సొమ్ములు అందుతున్నాయి. దీని వల్ల సాగుకు ఊతంగా ఉంటుంది. ఖరీఫ్, రబీ సాగులో అయ్యే ఖర్చంతా ప్రభుత్వం ఇచ్చినట్టవుతోంది.
– పాటి సింహాద్రి, కోడూరుపాడు, అల్లవరం

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం అందించిన సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని సాగులో మంచి ఫలితాలు సాధించాలి. ఆధార్ కార్డులు, బ్యాంకు ఈకేవైసీ కారణంగా డబ్బులు పడని రైతుల ఫిర్యాదులను స్పందనలో తీసుకుని పరిష్కరించి సాయం అందజేస్తున్నాం.
– కదలి ధర్మప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, అమలాపురం

క్లుప్తంగా

నేడు గృహ సారథులకు సమావేశం

అల్లవరం: గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇటీవల ఎన్నికైన గృహ సారథులకు సమావేశం నిర్వహించనున్నట్లుగా వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఉప్పలగుప్తం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు స్థానిక గొల్లవిల్లి కల్యాణ మండపంలో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జిన్నూరిని పరామర్శించిన ఎంపీ



వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ఎంపీ అనురాధ

ఉప్పలగుప్తం: అస్వస్థతకు గురై విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావును అమలాపురం పార్లమెంటు సభ్యురాలు చింతా అనురాధ పరామర్శించారు. మండలంలోని సంగవరం గ్రామంలో వెంకటేశ్వరరావు స్వగృహంలో సోమవారం ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు(బాబి), ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, పార్టీ నాయకులు శీలం సూరిబాబు, జంపన బాపిరాజు, నిమ్మకాయల హనుమంత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్ర ప్రాంతంలో నమూనాల సేకరణ



ఎస్.యానాం పర్ర ప్రాంతంలో నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాంలో సముద్ర తీర పర్ర ప్రాంతంలో గత కొన్ని రోజులుగా చేపలు మృత్యువాత పడుతుండడంతో కాలుష్య నియంత్రణ, మత్స్యశాఖ సిబ్బంది దళ్లపర్రలోని మట్టి, నీటి నమూనాను సోమవారం సేకరించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు నమూనాలు తీసుకుని ల్యాబ్‌కు పంపిస్తామని, వివరాలు 15 రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో పి.నాగవిష్ణు, కాలుష్య శాస్త్రీయ అధికారి పీవీఎస్ చలం, గ్రామ సహాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కావ్యకు సత్కారం



కావ్యను సత్కరిస్తున్న స్వరాగ అర్చన సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురానికి చెందిన బాల కవయిత్రి ఎస్.కావ్య రచించిన 'ఆమెకు వందనం' కవితకు పలువురు కవులు, సాహితీవేత్తల నుంచి ప్రశంసలు లభించాయి. రాజమహేంద్రవరం ఎస్‌జీఎం హాలులో మహిళా దినోత్సవం సందర్భంగా స్వరాగ అర్చన అనే సంస్థ సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కావ్యను సత్కరించి అభినందించారు. సంస్థ అధ్యక్షుడు వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు విఠల్‌తో పాటు పలువురు మహిళా రచయితలు, కవుల సమక్షంలో సత్కరించారు. కావ్య అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది.

అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిప్రమాదం

అమలాపురం రూరల్: ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న బయో టాయిలెట్స్ సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. డిపో గ్యారేజీ లోపల డీజిల్ బంకులు ప్రమాద స్థలానికి దూరంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న వెంటనే అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు. బయో టాయిలెట్స్‌కు వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయకపోవడంతో రెండేళ్లుగా అవి నిరుపయోగంగా ఉన్నాయి.

గృహసారథుల పాత్ర ఎంతో కీలకం



ఇందుపల్లిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

- సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పాత్ర ఎంతో కీలకమని, సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. సోమవారం ఇందుపల్లి 'ఎ' వన్ కన్వెన్షన్ హాలులో మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పౌర సేవలను ఇంటి వద్దకే అందించడంతో పాటు 1.40 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 2.40 లక్షల వలంటీర్ల నియామకాలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. నవరత్నాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. వలంటీర్లగా అనుబంధంగా ఇద్దరు గృహ సారథులు నిత్యం సంక్షేమ పథకాలపై పర్యవేక్షిస్తుంటారన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ పరంగా గృహ సారథులు కీలక పాత్ర పోషించ వలసి ఉంటుందన్నారు.

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల విధులు, విధానాలు, మార్గదర్శకాలపై వివరించారు. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే దిశగా గృహ సారథులు పనిచేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడిపూడి వెంకటేశ్వరబాబు, రూరల్ ప్రధాన కార్యదర్శి సూదా గణపతి, డీసీసీబీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీలు పాలమూరి బాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, వైఎస్సార్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, సర్పంచ్‌లు నక్కా అరుణకుమారి, చెల్లిబోయిన నాని, రేలింగి దుర్గరావు, గుత్తుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు మొదటి మూడు ర్యాంకులు సాధించిన 30 మంది విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు పితాని వీర వెంకట సత్యనారాయణ ఇంగ్లిష్, తెలుగు, డిక్షనరీ, గ్రామర్, వ్యాసాల పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా యోగాసనాలు, ఆరోగ్య సూత్రాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.శారదాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సత్యనారాయణ

మహిళల ముందడుగుతోనే సమాజ అభివృద్ధి

అమలాపురం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో యు.విజయకుమారి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీడీ శివశంకర ప్రసాద్ మహిళలతో కేక్ కట్ చేయించారు. మహిళలకు ఆటల పోటీలు, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయప్రసాద్, ఏపీఎం రమణి, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు



మహిళలతో కేక్ కట్ చేయిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

కొత్తపేట: మండలంలోని పలివెల చెరువుల వద్ద వరాల సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ మేరకు ఆలయ నిర్మాణకర్తలు గవర సాయిబాబా, శివనాగదుర్గారావు తదితరుల ఆధ్వర్యాన ఉదయం నుంచి అమ్మవారికి హోమాలు, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు, మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, పలివెల, గంటి, దేవరపల్లి, ఈతకోట, కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పలివెలలో సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న గంగాధరరావు, లక్ష్మీపతిరావు తదితరులు

ఘనంగా వీరభద్రుని సంబరం

ముమ్మిడివరం: ముమ్మిడివరం టీటీఆర్ నగర్‌లో మేడిద వారి వీరభద్రుని సంబరం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. మేడిద శ్రీరామచంద్రమూర్తి, సత్యశ్రీదేవి దంపతులు వీరభద్రుని బాజా భజంత్రీలు, బాణసంచా కాల్పులతో ఊరేగించారు. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద జమ్మిచెట్టు వద్దకు తీసుకొచ్చి విభూది పళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మేడిద పెద్దకాపు, చింతలపూడి బాలకృష్ణ, విళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు

ముమ్మిడివరం: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి బాలబాలికలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.గంగరాజు తెలిపారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, ఇంటర్ వారికి ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులతో పాట జాతీయ ఆహార సంస్థ మెనూ ప్రకారం భోజనం పెడతారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

మధుమేహంపై అవగాహన శిబిరం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు శివారు రంగనాయకపురం గ్రామంలో సోమవారం మధుమేహంపై అవగాహన శిబిరం నిర్వహించారు. తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని డా.బాదం బాలకృష్ణ ప్రారంభించారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల తవ్వకాన్ని నిలుపుదల చేయాలి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో పంట పొలాల చెంతన చేపట్టిన ఆక్వా చెరువుల తవ్వకాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక రైతులు చెరువుల తవ్వకాన్ని అడ్డుకుని ఆందోళన చేశారు. పచ్చని పంట పొలాల మధ్య ఆక్వా చెరువులకు ఏ విధంగా అనుమతి ఇస్తారని మత్స్యశాఖ అధికారులను నిలదీశారు. సరిహద్దు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తే తవ్వకాలను నిలిపేస్తామని చెప్పారని, అయినా చెరువులు తవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు తెలిపారు.

నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అల్లవరం: మండలంలోని అల్లవరం శ్మశానవాటిక వద్ద సోమవారం సాయంత్రం గంజాయితో ఉన్న నలుగురు యువకులను అల్లవరం ఎస్ఐ శ్రీనునాయక్ దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. శనివారం సాయంత్రం గోపాయిలంక ఆక్విడెక్టు వద్ద గంజాయి తాగుతున్న నలుగురు యువకుల్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. రెండు రోజుల వ్యవధిలోనే మరో నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఆ యువకుల వివరాలు పోలీసులు వెల్లడించలేదు. ఘటనా స్థలంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీవీ సత్యనారాయణ, వీఆర్‌ఓ ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌లో పొగలపై ఆందోళన



డంపింగ్ యార్డు సమస్యపై ఆందోళనకారులతో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్



కార్మికనగర్ రోడ్డు పొడవునా నిలిచిపోయిన చెత్త తరలింపు వాహనాలు

- కార్మికనగర్‌లో రోడ్డుపై బైఠాయించిన బాధితులు
- 7 గంటల పాటు చెత్త తరలించే వాహనాల నిలిపివేత
- మంత్రి విశ్వరూప్ హామీతో ఆందోళన విరమణ

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ డంపింగ్ యార్డులో తరచూ చెత్తగుట్టల నుంచి ఎగసి పడుతున్న మంటలు, పొగలతో తాము అనారోగ్యాలకు గురవుతున్నామని బాధిత ప్రజలు స్థానిక కార్మికనగర్‌లో ధర్నా చేశారు. పట్టణంలో రోజూ చెత్త తరలించే 16 టిప్పర్లు, 11 ట్రాక్టర్లను కార్మికనగర్ వంతెన వద్ద రోడ్డుపై బైఠాయించి నిలిపేశారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఆందోళన చేశారు. చెత్తను తరలించే వాహనాలన్నీ నిలిచిపోవడంతో పట్టణంలో పారిశుధ్య పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పారిశుధ్య పర్యవేక్షణ ఇంజినీర్లు ఆందోళనకారులతో చేసిన చర్చలు విఫలమయ్యాయి. చివరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ వచ్చి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

మూడు నెలల్లో సమస్యకు పూర్తి పరిష్కారం

ఆందోళన విషయం తెలిసి స్వయంగా అక్కడకు చేరుకున్న మంత్రి విశ్వరూప్ బాధితులతో మాట్లాడారు. అనంతరం మోటారు సైకిల్‌పై వెళ్లి డంపింగ్ యార్డులో పరిస్థితిని పరిశీలించారు. డంపింగ్ యార్డుకు బైపాస్ రోడ్డు నుంచి రూ.80 లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి చెత్త వాహనాలు కార్మికనగర్ నుంచి వెళ్లకుండా చర్యలు చేపడతామన్నారు. త్వరలోనే చెత్త శుద్ధీకరణ ప్లాంటు నిర్మితం కానుందని, అది అందుబాటులోకి వస్తే చెత్త గుట్టలు, పొగల సమస్య ఉండదని చెప్పారు. రానున్న మూడు నెలల్లో సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. దీంతో నిలిచిపోయిన చెత్త తరలింపు వాహనాలు అక్కడ నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లాయి. సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే వరకు చెత్త నుంచి మంటలు, పొగలు రాకుండా రోజూ ఫైరింజన్‌తో వాటరింగ్ చేయిస్తానని కమిషనర్ స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, బండారు గోవిందు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

యానాం: పుదుచ్చేరిలో రాష్ట్ర స్థాయి ఓపెన్ అథ్లెటిక్స్ పోటీల్లో యానాం నుంచి ప్రాతినిధ్యం వహించిన 8 మంది విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ చింతా వెంకన్న, కోచ్ పబ్బినీడి శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఆరు బంగారు పతకాలు, మరో ఆరు రజత పతకాలు సాధించారన్నారు. 200 మీటర్లలో వంశీ బంగారు పతకం, 400 మీటర్లలో వెండి పతకం, పి మనీషా 100, 200 మీటర్లలో బంగారు పతకాలు, తేజస్విని 800, 1500 మీటర్లలో బంగారు పతకాలు, రాజేష్, వెంకట్, శివ, బాబీ 100 మీటర్ల పరుగులో వెండి పతకాలు సాధించారన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఇండియన్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ

గృహ నిర్మాణాలకు సాయం అందజేత

యానాం: నియోకవర్గ పరిధిలో పుదుచ్చేరి మురికివాడల అభివృద్ధి పథకం ద్వారా చేపడుతున్న గృహ నిర్మాణాల నిమిత్తం రూ.95.70 లక్షల విలువైన ఆర్థిక సహాయ ధ్రువీకరణ పత్రాల్ని 78 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, మురికివాడల అభివృద్ధి పథకం అధికారులు పాల్గొన్నారు.

78 మంది లబ్ధిదారులకు రూ.95.70 లక్షలు



లబ్ధిదారులకు ఆర్థిక సహాయ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి

మిథున్‌రెడ్డిని కలిసిన కుడుపూడి



మిథున్‌రెడ్డి తదితరులను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: తాళ్లరేవు మండలం పిల్లంకలో జరిగిన వైఎస్సార్ సీపీ అంతర్గత సమావేశంలో పాల్గొన్న పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డిని ఎమ్మెల్సీగా ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించినందుకు మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సందర్భంలో మిథున్‌రెడ్డితో ఉన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావులను పార్టీ అమలాపురం నియోజకవర్గ నాయకులు గజమాలతో ఉమ్మడిగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

తాళ్లరేవు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీష, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ అద్దంకి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. పలువురు యువకులు, స్థానికులు రక్తదానం చేశారు. శిబిరంలో 15 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

ముల్లమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

యానాం: గిరియాంపేట గ్రామదేవత ముల్లమ్మ అమ్మవారి ఆలయప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అశోక్ పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం గుడిని నిర్మించినందుకు ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొబ్బరి రైతుల అభివృద్ధికి కృషి చేస్తా

యానాం: యానాం నియోజకవర్గంలో కొబ్బరి రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ కాంప్లెక్స్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ఫార్మర్స్ వెల్ఫేర్, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) ఆధ్వర్యంలో కొబ్బరి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 96 మంది రైతులకు ప్రోత్సాహక సహాయంగా రూ.5.4 లక్షలను ఎమ్మెల్యే అశోక్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, డీడీ గణేషన్, వ్యవసాయాధికారి జోగిరాజు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.